



‘జయా! నీకోసం ఎవరో వచ్చారు!” అంటూ వచ్చింది అరుణ.

“ఎవరై వుంటారబ్బా?” అనుకుని తలెత్తి చూసింది జయ. ఎవరో ఇద్దరు అమ్మాయిలు ! వాళ్ళని ఇదివరకు ఎక్కడా చూసినట్టు గుర్తులేదు.

“నమస్కారమండీ” అంది ఇద్దరిలో ఒకమ్మాయి చేతులు జోడిస్తూ.

ప్రతి నమస్కారం పెట్టి కుర్చీ చూపించింది జయ. రెండు నిముషాలు ఎవరూ మాట్లాడలేదు.

చివరకు ఆ రెండో అమ్మాయి అంది: "ఈ మధ్య జ్యోతిలో వచ్చిన మీ కథ చదివానండీ, చాలా బావుంది"

"అలాగా - థాంక్స్" అంది జయ అంతకన్నా ఏమ్మాట్లాడాలో తోచక.

"అది చదివినప్పటినుండీ మిమ్మల్ని చూడాలనే నా తహతహ ఈ రోజుగానీ తీరలేదు" అంది ఆ అమ్మాయి.

రెండో అమ్మాయి అందుకుంది. "జ్యోతిలో మీ ఫోటో కూడా వుందిగానీ - ఆ ఫోటోకన్నా మీరే బావున్నారండీ."

జయ ఇబ్బందిగా ఫీలయింది.

"మీరింత అందంగా వున్నారుకదా - మరి మీ సౌందర్య రహస్యమేమిటో మాక్కాస్త చెప్తారా?" అడిగింది మళ్ళీ రెండో అమ్మాయి.

' సబ్బుల అడ్వర్‌టయిజ్‌మెంట్ బాపతు మనుషుల్లా ఏమిటీ ప్రశ్నలూ ?' అనుకుంటూ నవ్వింది అరుణ.

అరుణవంక తిరిగి మళ్ళీ అడిగింది ఆ అమ్మాయి:

" ఇందాకటినుంచీ మిమ్మల్ని గమనించలేదు గానీ - మీరు జయకన్నా అందంగా వున్నారండీ ! మీ కళ్ళు - కనుబొమ్మలూ - ఓహ్ ! ఇంత అందాన్ని నేనెక్కడా చూళ్ళేదు ! ముఖ్యంగా ఆ వెంట్రుకలు... పొట్టిగా వున్నప్పటికినీ, నల్లగా వంకీలు తిరిగి ఎంత ముద్దొస్తున్నాయో ! అన్నట్టు మీరేమేం వాడ్తారో చెప్పండి. మేముకూడా ఫాలో అవుతాం."

ఆ అమ్మాయి అలా ఏ మాత్రం సంకోచం లేకుండా అడుగుతోంటే ఆమెతో వచ్చిన ఆ రెండో అమ్మాయి మాత్రం అసహనంగా ఫీలవుతోంది.

ఆమె వాక్ ప్రవాహం ఇప్పట్లో ఆగేట్టు లేదని గ్రహించి అంది అరుణ: "చెప్పక తప్పదంటారా ? అయితే జాగ్రత్తగా వినండి - పొద్దున్నే లేచి టూత్ పేస్టు బదులు కొబ్బరిపీచుతో పళ్ళుతోముతాను. ఆ తర్వాత స్నానానికి రెండు బకెట్ల నీళ్ళలో చెంచా ఉప్పుపొడి, మరో చెంచా నిమ్మరసం పోసి స్నానం చేస్తూంటాను. పోతే ఉదయం లేచీ లేవడంతోనే నా కళ్ళని తేనె నీటితో కడుగుతూ వుంటాను. ఇక తల వెంట్రుకల విషయం అంటారా ? రెండు నేరేడుపళ్ళను మెత్తగా నూరి ఆ రసం పిండి కొబ్బరి నూనెలో కలుపుతాను! రోజూ రాత్రి పడుకోబోయేముందు అది తలకి పెట్టుకోవడం జుట్టుకు ఎంతో మంచిది."

ఎంతో గంభీరంగా - నోటికి వచ్చిందల్లా చెప్పేస్తోన్న అరుణని చూసి - వస్తోన్న నవ్వు అతికష్టమ్మీద బిగబట్టుకుంది జయ.

" అలాగాండీ ! అయితే ఈ షాంపూలూ, హేరాయిల్స్, సబ్బులూ ఇవన్నీ ఉత్త దండగే అన్నమాట ! అడిగినవెంటనే చెప్పారు - థాంక్సండీ. ఇంటికి వెళ్ళి నేను

కూడా ట్రై చేస్తాను" అందా అమ్మాయి సంతోషంతో.

వాళ్ళిద్దరికి కాఫీలిచ్చి పంపించింది జయ.

"అదేమిటీ పాపం ! ఆ పిల్లనలా వెర్రిదాన్ని చేసి ఆడించావ్?" అడిగింది జయ నవ్వుతూ.

"లేకపోతే బొత్తిగా కొత్తాపాతా లేకుండా ఏమిటో ఆ వెధవ ప్రశ్నలు ?" కస్సు మంటూ - "అవన్నీ వాడి, వున్న జుట్టు కాస్తా వూడిపోతే రోగం కుదుర్తుంది. మళ్ళీ ఎవర్నీ ఇలా అడగదు!" అంది అరుణ.

❋❋❋❋❋❋

"ఈ రోజు ఒకర్ని ఏడ్పిస్తాను" కాళ్ళూపుతూ ధీమాగా అంది అరుణ.

"చెప్పేశావుగా ! చెప్పినందుకైనా ఏడ్వం!" అంది రజిత.

"చెప్పకున్నా, ఏడ్చేరకం కాదులే!" అంది జయ.

"ఏడ్పించి తీరుతాను!" అంది అరుణ పట్టుదలగా.

"పోవోయ్ ! ఇక్కడ ఏడ్చేవాళ్ళు ఎవరూ లేరు" అంది చేగోడీ విసుగ్గా.

"చూడండీ నేనే నెగ్గుతానో - మీరే నెగ్గుతారో !" అంది అరుణ.

"నీ ముఖం, పోవే !" నిర్లక్ష్యంగా అంటూ స్నానానికి వెళ్ళిపోయింది జయ.

ఓ పావుగంటయ్యాక "ఏయ్ రాజీ - మనమలా వెళ్ళొద్దాం పదవే!" అంది అరుణ.

"ఎందుకూ ?"

"ఊరికేనే..."

ముగ్గురూ కలిసి కారిడార్లో నడుస్తూ 'బాత్‌రూమ్స్ కార్నర్'కి వచ్చారో లేదో లోపలినుంచి కెవ్వుమంటోన్న జయ కంఠం విన్పించింది.

"ఏమైందే ! అలా అరుస్తున్నావ్ ?" గాభరాగా అడిగింది చేగోడీ.

జయ - సమాధానం చెప్పకుండా అరుస్తూనే ఉంది.

అరుణ ముఖం చూసింది రజిత. అరుణ నవ్వుతోంది.

"దాని జాకెట్‌మీద షుగర్ చల్లాను. చీమలు పట్టాయి. ఒళ్ళు పొగరు కదూ- చూసుకోకుండా వేసుకున్నట్లుంది ! కుట్టేస్తున్నాయ్ అదీ కథ !" అంది అరుణ తేలిగ్గా.

"ఎంత అడివి మనిషివే అరుణా నువ్వు! ఏడ్పించేది ఇలాగటే?" మందలిం చింది రజిత.

మరో పావుగంటయ్యాక, ఎర్రబడ్డ కళ్ళతో - భళ్ళున తలుపులు తెరుచుకుని, ఎదురుగ్గా కన్పించిన అరుణపై విరుచుకు పడింది:

"ఆ పని చేసిందెవరో గానీ - అది డొక్కురాస్కెల్ - లెట్రిన్, బాత్‌రూం, చీపురు కట్ట, చింతపండూ, చెప్పులూ, బండ, కుర్చీ, పెన్నూ...."

తెల్లబోయి చూస్తోన్న ఒక కొత్తమ్మాయిని చూస్తూ అంది రజిత: "అవన్నీ ఆవిడ తిట్లు ! ఆ ఆపిల్లకి ఎలా తిట్టాలో తెలీదు ! కళ్ళకేది కన్పిస్తే ఆ పేరుతో తిడ్తుంది."

❁❁❁❁❁❁

"రజిత ఏదీ ? కన్పించట్లేదు! " అడిగింది జయ.

"వాళ్ళ అన్నయ్య వచ్చాడులా వుంది. విజిటర్స్ రూంలో మాట్లాడ్తోంది" చెప్పింది అరుణ.

"మరి అప్పటి నుండీ చెప్పావ్ కావేం ?" చెదిరిన జుట్టు సవరించుకుని: "అతడు నాకు ఇదివరకే తెలుసు! అతడొచ్చాడని తెలిసీ - మాట్లాడించకపోతే బావుండదేమో? వెళ్ళి మాట్లాడి వస్తాను"? అంటూ విజిటర్స్ రూంకి దారి తీసింది జయ.



" హాయ్! బావున్నారా ? " అంటూ పలకరించిన జయని చూడగానే వినోద్ గుండె క్షణకాలం లయ తప్పింది.

''ఆఁ.........ఆఁ.......ఆఁ....బావున్నాను'' అంటూ తడబడ్డాడు.

రజితతో మాట్లాడుతున్నాడేగానీ - మనసులో ఒకసారి జయని చూస్తే బావుణ్ణని- తను వెళ్ళేలోగా ఆమె తనతో మాట్లాడకున్నా - కనీసం ఒకసారి కన్పించినా చాలని- తహతహలాడాడు. తీరా ఆమె తనంతట తానే వచ్చి పలకరించేసరికి, ఆ సంతోషంలో కంఠమే పెగల్లేదు అతడికి.

జయ రాగానే అతడి కళ్ళల్లో మెరిసిన మెరుపులు చూసి, లోలోపలే నవ్వుకుంది రజిత.

"ఎక్కడుంటున్నారు ? వరంగల్లో నేనా!?" అడిగింది జయ ఏమీ మాట్లాడకపోతే బావుండదని.

" ఆ ! అక్కడే ! మీ సంగతేమిటీ? బాగా చదువుతున్నారా?" తోచిందేదో అడిగాడు.

"బావుంది ! ఇన్ని రోజుల తర్వాత కలుసుకుంటే - ఇవా మీరు మాట్లాడుకునేది!? హయ్యో రాత ! ఇద్దరూ ఇద్దరే!" నెత్తి కొట్టుకుంటూ:

"అన్నట్లు అన్నయ్యా, నీకు చెప్పడం మరిచాన్రా ! మన జయ రాసిన సీరియల్ ఇప్పుడు పత్రికలో వస్తోంది! చదువుతున్నావా? ఎలా వుంది.?" అంది రజిత.

''సంభాషణలవీ మృదుమధురంగా, చదివినకొద్దీ చదవాలనిపించేలా, మున్ముందు ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ కలిగిస్తూ - ఏమైతేనేం - ప్రతివారం ఎదురు చూసేట్టు వుంది ! కానీ...." క్షణం ఆగాడు వినోద్.

జయ చెవులు రిక్కించింది.

"కానీ... మీరు తీసుకున్న కథా వస్తువే నచ్చలేదు నాకు ! డబ్బూ, అందం చదువూ అన్నీ వున్న యువకుడు తనను ప్రేమించిన అమ్మాయిని వివాహం

చేసుకోవడానికి చేసే ప్రయత్నంలో - అడుగడుగునా ఏవో అడ్డంకులూ, అపార్థాలూ ఎదురై - అతడి కోరిక తీరకపోవడం... మళ్ళీ ఇద్దరు దగ్గరయ్యేలోగా - మరో సమస్య ముందుకొచ్చి విడిపోవడం... మధ్య మధ్య మధురమైన సంఘటనలు సృష్టించి - ఆ కాసేపు యువతరాన్ని సుందరమైన వూహాలోకంలో విహరించేలా చేసి - ఎన్నెన్నో మలుపులు తిప్పి - చివరకు వాళ్ళిద్దర్నీ కలిపి రచయిత్రి పుణ్యం కట్టుకోవడం... ఇలాంటి నవలలు సమాజాన్ని ఉద్ధరించడమటుంచి, సాధారణ పాఠకుడికి జీవితమంటే ఏమిటో తెలీనీకుండా చేసి - అతడి మనసును ప్రేమ కథలకి మించి ఎదగనీకుండా చేస్తాయి ! మీ చుట్టూ ఎన్నో సమస్యలున్నాయి! అంతెందుకూ... మీ స్త్రీల సమస్యలనే తీసుకోండి! తలచుకుంటే మీరా సమస్యల నాధారంచేసుకుని, నలుగురికీ పనికి వచ్చే రచనలు చేయవచ్చు ! మీకీ టాలెంట్ వున్నప్పుడు మీరీ అవకాశాన్ని ఎందుకు సద్వినియోగం చేసుకోకూడదూ?''

"అలాంటి రచనలు చేయడానికి నాకేం అభ్యంతరంలేదండీ! కాకపోతే కొందరు పాఠకులు వాస్తవాన్ని అర్థం చేసుకోకుండా నేను స్త్రీల పట్ల పక్షపాతంతో రాస్తున్నాననీ, నా రచనలు వన్‌సైడెడ్‌గా వుంటున్నాయని విమర్శిస్తారేమోనని తటపటాయిస్తున్నాను!'' అంది జయ.

"చూడండీ - ఎవరికి తోచిన విమర్శలు వాళ్ళెప్పుడూ చేస్తూనే వుంటారు. అంత మాత్రాన మనం అధైర్యపడకూడదు. నిజానికి మనమొక ఆశయాన్ని దృష్టిలో పెట్టుకుని రచనలు చేస్తున్నప్పుడు ఇలాంటి విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వాళ్ళు చేసే ఆ విమర్శల్లో మాత్రం పురుష పక్షపాతం, వ్యక్తిగత ద్వేషం, ఓర్వలేనితనం ఉండవని ఎలా చెప్పగలం ? మీలాంటి రచయిత్రులు పూనుకుని మీ రచనలద్వారా సమాజంలో చైతన్యమనేదే కల్గించకపోతే, మన దేశ స్త్రీల పరిస్థితులు ఇంకో వందేళ్ళ తర్వాత కూడా ఏ మార్పులూ లేకుండా ఇప్పట్లాగే వుంటాయి!''

"బహుశా ఇంతకు పూర్వం స్త్రీ పరిస్థితులు నువ్వు చెప్తోన్నంత దారుణంగా ఉండేవేమోగానీ, మన సమాజంలో ఇప్పుడు స్త్రీకి స్వేచ్ఛలేదన్నా - మగవాళ్ళ దౌర్జన్యానికి గురవుతోందన్నా - నేనొప్పుకోను అన్నయ్యా.....''

" కారణం....!''

" పురుషులతో సరిసమానంగా మేమిప్పుడు చదువుకుంటున్నాం, ఉద్యోగాలు చేస్తున్నాం! చివరకు రాజ్యాలను కూడా ఏలుతున్నాం! ఇంతకన్నా స్వేచ్ఛ ఇంకేముంటుంది?''

" పిచ్చిదానా, చదువుకుని ఉద్యోగాలు చేసినంత మాత్రాన అది స్వేచ్ఛ అన్పించుకుంటుందా ? సపోజ్ - నీకో ఫ్రెండుంది! నీకు ఉన్నట్టుండి సినిమా చూడాలనే బుద్ధిపుట్టి, ఆమెని పిక్చర్‌కి రమ్మని అడిగావ్. 'ఏమోనమ్మా! వాళ్ళ నాన్న ఊళ్ళోలేరు. చెప్పకుండా వెళ్తే ఆయనకు కోపం' అంటూ వాళ్ళమ్మ మీ సరదాలకి అడ్డుకట్ట వేస్తుంది. అదే అక్కడ తన కూతురుకు బదులుగా తన కొడుకే

వుంటే - ఆ మాట అనేదేనా ఆ తల్లి ? పెళ్ళయ్యేదాకా మీ పరిస్థితులు అలా వుంటే- పెళ్ళయ్యాక మరోలా ? అకస్మాత్తుగా నీ క్లోజ్ ఫ్రెండ్‌ది... మాటవరుసకి జయదే... అనుకో.... వెడ్డింగ్ కార్డ్ వస్తుంది! నీకు వెళ్ళాలని వుంది ! భర్త క్యాంపులో వున్నాడు! అడక్కుండా వెళ్తే ఆయనకి కోపం ! అతడొచ్చేదాకా నీవు ఆగినా - నీకోసం ఆ పెళ్ళి ఆగదు! ఆ పరిస్థితుల్లో ఎలా ? ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే మన కుటుంబాల్లోని స్త్రీలు స్వతంత్రించి స్టెప్ తీసుకోలేక పోతున్నప్పుడు... ఆమె స్వేచ్ఛావాయువులు పీలుస్తోందని ఎలా ఒప్పుకోమంటున్నావ్ ?''

వినోద్ చెప్పిన ప్రతి మాటా జయని బాగా ఆకర్షించింది.

''ఈ రోజు నాకు తెలీని కొన్ని విషయాలు మీద్వారా తెలుసుకున్నాను. థాంక్సెలాట్! ఇక ముందు మాత్రం మీ సూచనని కూడా దృష్టిలో పెట్టుకుని రచనలు కొనసాగిస్తాను - ఇక వెళ్ళొస్తాను! బై!'' అంటూ లోపలికి వెళ్ళిపోయింది జయ.

జయ అటువెళ్ళగానే వినోద్‌కేసి ఆశ్చర్యంగా చూస్తూ అంది రజిత: ''ఒరేయ్! ఈ మాటలన్నీ నీ నోటినుంచే వచ్చాయట్రా? అద్సరేగానీ ప్రేమ కథలంటూ తెగ విమర్శించావ్‌గానీ, నీ ప్రేమాయణం.... సంగతేమిటీ?''

'' ప్రేమ కథలు రాయొద్దని చెప్పినంత మాత్రాన ఎదుటి వాళ్ళని ప్రేమించొద్దని చెప్పినట్టా రాజీ ? ప్రేమ అనేది కథల్లో ఎక్కడో ఓచోట తొంగిచూస్తే బావుంటుంది గానీ, కథంతా ప్రేమే నిండిపోతే పాఠకులకు మొహం మొత్తుతుంది! సరే, నాకు ట్రెయిన్‌కు టైమవుతోంది. నేను వెళ్తాను మరి! ఇంద ! ఇది నీ ఖర్చులకు ఉంచుకో!'' అంటూ ఆమె చేతిలో డబ్బు పెట్టి వెళ్ళిపోయాడు వినోద్.

❋❋❋❋❋

రజిత ఫైనల్ పరీక్షలు వ్రాసి ఇంటికి వెళ్ళిపోయింది. జయ తన ఎమ్మే ప్రీవియస్ పరీక్షలు రాస్తోంది. అరుణ హౌస్ సర్జన్ చేస్తోంది. నిర్మలకి బాబు పుట్టాక టీచర్ ఉద్యోగం దొరికింది. చంద్ర - జయకి ఒకటి రెండు సార్లు బజార్లో కన్పించింది. మొదటిసారి ఎదురైనపుడు చంద్ర జరిగినదానికి సిగ్గు పడ్తోన్నట్టుగా, మాట్లాడ టానికి సంకోచిస్తున్నట్టుగా కన్పించడంతో - రెండోసారి జయే పలకరించింది: ''బావున్నావా చంద్రా?''

చంద్ర కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'' పరిస్థితులు ఎలా వున్నాయి ?'' అడిగింది.

వేశ్యాగృహాలన్నీ పావనం చేసి గొంతులో చుక్కేసుకుని ఏ అర్థరాత్రో ఇంటికి వస్తూంటాడని చెప్పి, కళ్ళనీళ్ళు తుడుచుకుంది చంద్ర.

❋❋❋❋❋❋

రిజల్ట్స్ వచ్చి, రజిత సెకండ్ క్లాస్‌లో పాసయింది.

'' వాట్ నెక్స్ట్ ? చదువా- పెళ్ళా ?'' అడిగాడు వినోద్.

" పెళ్ళంటూ జరిగితే మనిద్దరిదీ ఒకేసారి జరగాలి! అంతే !" అంది రజిత.

" అదేమిటీ ? నేను మగాణ్ణి, నాకేమిటీ తొందర ?"

" మగాడూ గిగాడూ కుచ్‌భీ జాంతానై ! ఆ రోజు చెప్పిన ఉపన్యాసం అప్పుడే మరిచిపోయావా - ఆడవాళ్ళూ మగవాళ్ళూ అన్నింట్లో సమానులేనన్నది ? మరి నీకు నీ పెళ్ళికిలేని తొందర - నా పెళ్ళికేం వొచ్చిందట! నిజానికి పెళ్ళి కావల్సింది ముందు నీకు! నువ్వు నాకన్నా మూడేళ్ళు పెద్దవాడివి తెలుసా ?"

" తెలుసుగానీ చెల్లెమ్మా - అమ్మనీకేమో సంబంధాలు చూస్తోంది! ఆ సంగతి నీకు తెలుసాంట ?" ఎదురు ప్రశ్న వేశాడు వినోద్.

" చూడనీ - పోయిందేముంది ? చూసిన వాటికల్లా వంకలు పెడ్తూ కూర్చుంటే సరి!"

" రాజీ - రాజీ ! నువ్వు నా బంగారు రాజీవికదే ! నీలాంటి మంచి అమ్మాయిలు ఎప్పుడైనా అలాంటి చెడ్డ పన్లు చేస్తారేమిటీ ?

" నువ్వెంత మస్కా కొట్టినా - ఎన్ని చెప్పినా - మనం వినేది సున్నా."

" అలా అంటే ఎలాగే. ఇటు పెళ్ళన్నా చేసుకో. అటు ఎమ్మే అయినా చదువుకో! రెండూ వొద్దని ఇంట్లో కూర్చుంటే ఎం బావుంటుంది?"

" ఏమో - నాకదేం తెలీదు! నాకు రెండూ యిష్టంలేదు" పెంకిగా అంది రజిత.

" ఎందుకు ఇష్టంలేదు" అరిచాడు వినోద్."

" నీ కెందుకిష్టంలేదో చెప్పుముందు."

" ఇష్టం లేదని ఎవరన్నారు ?"

" అయితే చేసుకుంటావా ?"

" ఇప్పుడు చేసుకోవడం యిష్టంలేదంటున్నాను."

" నా సమాధానం కూడా అంతే అంటున్నాను" అంది రజిత.

" జగమొండి! నా మాట విననపుడు - నీతో నాకేం పనిట!" అలిగి తోటలో కూర్చున్నాడు వినోద్.

తర్వాత ఎందరెన్ని రకాల చెప్పిచూసినా రజిత విన్లేదు. పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేకపోతే కనీసం చదువుకోమన్నారు! అదీ ఇష్టం లేకపోతే ఉద్యోగం చేయమన్నారు! ఏదీ చెయ్యనని ఖచ్చితంగా చెప్పేసింది.

" కంటిన్యూ చేస్తే మీ జయతో... ఇంకొక సంవత్సరం కలిసి చదువుకోవచ్చు!" ఆశ పెట్టాడు వినోద్.

" అక్కర్లేదు !"

" ఈసారి తన దగ్గర అరుణా గిరుణా ఎవరూ ఉండరు ! నీకక్కడ పోటీకూడా ఉండదు ! ఎంచక్కా ఒక్కర్తివే ఆమెతో తనివితీరా కబుర్లు చెప్పుకోవచ్చు"

వినోద్ ఒక్కొక్క మాటకి రజిత దృఢనిర్ణయం సడలిపోవడం మొదలెట్టింది.

ఈ కలిసొచ్చిన అవకాశాన్ని కాలదన్నుకోకూడదనిపించింది. కాని తన మొండితనమంతా ఏ కార్యసాధనకో గుర్తొచ్చి, దాని ముందు ఇది అల్పవిషయంగా తోచి, "అన్నయ్యా, ప్లీజ్ - నాకిష్టంలేదని చెప్తున్నాను మాటిమాటికీ నన్నిలా అడిగి నన్ను విసిగించకు - నీకు పుణ్యముంటుంది!" అంది రజిత ఖచ్చితంగా.

ఎమ్మే ఫైనలియరంతా జయ హాస్టల్లో ఒంటరిగానే వుండిపోయింది.

అరుణ హౌస్ సర్జన్ పూర్తయి ఎమ్‌డీ చేస్తోంది. చేగోడీ బి.ఏతో మానేసింది! ఆ సంవత్సరమంతా జయకి రజిత నుంచి లెటర్స్ రావడం, ప్రతి ఉత్తరానికీ రిప్లై యివ్వడంతోనే గడిచిపోయింది. జయకి ఎమ్మేలో ఫస్ట్‌క్లాస్ వచ్చి, తను చదివిన కాలేజీలోనే లెక్చరర్ ఉద్యోగం దొరికింది.

భారతి మేడం రిజైన్ చేయడంతో హాస్టల్‌కు వార్డెన్‌గా జయే నియమింపబడింది.

❋❋❋❋❋❋

జయ వచ్చి భుజం తట్టడంతో గతం ఆలోచిస్తూన్న నిర్మల ఉలిక్కిపడింది.

"అద్సరేగానీ జయా ! నువ్విలా ఉద్యోగంలోచేరి వార్డెన్‌వై కూర్చుంటే మీ మామ్మ ఏమీ అనలేదా ?"

" ఎందుకన్లేదూ ? గుండెలు బాదుకుంది ! 'చూడబోతే నిన్ను చదివిస్తే వున్నమతి పోయినట్టుందంది. ఎంచక్కా పెళ్ళి చేసుకుని మొగుడితో సంసారం చేయక నీకిదేం పోయేకాలం అవ్వ ! అవ్వ ! ఎవరన్నా వింటే నవ్విపోతార'ంది. 'నా కంఠంలో ప్రాణముండగా నిన్నా వుద్యోగానికి పంపించన'ంది."

" మరేం చేశావ్ ?"

" చేయడానికి ఏముందీ ? మనసులో వున్నదే చేశాను! 'నెత్తీనోరూ బాదుకున్నా వినేదిలేదు ! కావాలంటే నా పెళ్ళికయ్యే ఖర్చుతో పదేళ్ళనుంచి కట్నమిచ్చుకోలేక పడున్న పక్కింటి సీతకి పెళ్ళి చెయ్యీ' అన్నాను."

" భేష్ ! అలాగైనా ఒక జీవితాన్ని ఉద్ధరించాలనుకున్నావన్నమాట! అచ్ఛా! నువ్వామాటంటే మరి తనేమంది ?"

" తారాజువ్వలా లేచింది ! 'గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్టు నాకు సలహాలు చెప్పొచ్చేదానివయ్యావుటే - ఆ సీతలా పెళ్ళికాలేని వాళ్ళూ, దిక్కులేనివాళ్ళు ఆ వుద్యోగం చేసినా బావుంటుందిగానీ - అన్నీ వున్న నువ్వు పెళ్ళీ పెటాకుల్లేకుండా ఉద్యోగమంటూ బజార్లు ఎక్కుతావా ?' అంటూ దుమ్మెత్తిపోసింది ! నన్ను కాదని దులుపుకుని వచ్చేశాను. ఇప్పుడు శాంతించి రాజీ ప్రయత్నాల్లాంటివేవో చేస్తోంది. వెర్రి మామ్మ ! ఇంకా నామీద ఆశలు పెట్టుకుంటోంది."

" ఏమో జయా, నాకు నీ వరసేం నచ్చట్లేదే ! పెళ్ళిచేసుకోనంటూ నువ్వు పిచ్చి స్టెప్ తీసుకున్నావనిపిస్తోంది. వైవాహిక జీవితంలోని మాధుర్యం, సంతృప్తీ ఈ ఒంటరి జీవితంలో ఎక్కడివే !"

" అలాంటి మాధుర్యంపట్ల నాకే వ్యామోహం లేదు నిమ్మీ - నాకా జీవితం

తలుచుకుంటేనే రోతగా, రొటీన్‌లా, యాంత్రికంగా అన్పిస్తుంటుంది. ఈ విషయాలు చర్చించడానిక్కూడా నాకు విసుగ్గా వుందిగానీ - ఇంకేవైనా కబుర్లు చెప్పవే! చాలా రోజుల తర్వాత కలిశావు కదా - నీ విశేషాలేం చెప్పకుండా వచ్చీరాగానే నన్ను దులుపుతున్నావ్ !"

" విశేషాలకేంలేవే....!? వినడానికి నీకు ఓపిక ఉండాలేగానీ - బోల్డున్నాయి! పొద్దున్నే ఓవంక వంటతో కుస్తీ పడ్తూ వుంటాను! పగలంతా బాబు చేసే అల్లరికీ తట్టుకోవాలి! వేలెడు లేడుగానీ - వీడూ, పక్కింటి నానిగాడూ చెరో కర్రా పుచ్చుకుని రోజూ ఫైటింగ్ చేస్తుంటారనుకో ! ఇక అవన్నీ శృతి మించి రాగాన పడ్డప్పుడు చూడాలి.... జీవితమ్మీదే విరక్తి పుడుతుంది!" అంది నిర్మల.

" నీదంతా విచిత్రం కాకపోతే నీకు జీవితమ్మీద విరక్తి పుట్టడమేమిటీ? ఏదైనా చెప్పినా ఎదుటివాళ్ళు నమ్మేలా వుండాలి. పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల్ని కంటూ సంసారం చేస్తూంటే... ఎంత హాయి ! ఎంత ఆనందం ! ఎంత సంతృప్తి - ఏం కథా!" అంటూ ఎగతాళి చేసింది జయ.

" ఇందాక నీకేదో ఉపదేశించాను గానీ, నిజానికి నాకు నా జీవితంకన్నా నీ జీవితమే బావుందనిపిస్తుందే ! ఏముందీ మా లైఫ్‌లో ? నెల జీతం అందుకోవడం, చాలీ చాలక అప్పులు చేయడం, ఏదైనా పొరపాటు చేస్తే శ్రీవారితో తిట్లు తినడం - పిల్లల్ని కనడం - వారిని పెంచడం - రెక్కలొచ్చాక వాళ్ళు మనల్ని తన్ని వెళ్ళి పోతూవుంటే - నిస్సహాయంగా చూస్తూ ఇదీ ప్రపంచం అనుకోవడం - లైఫంటే ఇదేనా ? దీని కోసమేనా ఇంత తాపత్రయం....."

" అద్గదీ - అలా రా - దార్లోకి! పైకి నీలాగే అందరూ నీతులు చెప్తారు గానీ వాళ్ళ అంతరాంతరాల్లో ఈ రకపు జీవితంతో విసిగిపోయే వుంటారు. అఫ్‌కోర్స్, ఆ విషయాన్ని పైకి ఎవరూ ఒప్పుకోరు ! ఎందుకంటే నాలా అసాధారణ జీవితం కొనసాగించే ధైర్యం వాళ్ళకుండదుకనుక ! 'నలుగుర్తోపాటు నేనూ' అనుకుంటారు- అద్సరేగానీ బాబుని తీసుకుని రాకుండా ఒక్కర్తివే వస్తే-మీ అత్తగారేం అన్లేదా ?"

" ఒక రోజులో తిరిగి వస్తానని చెప్పానుగా - లోపల తిట్టుకుందేమోగానీ పైకి ఏమీ అన్లేదులే ! వచ్చేటప్పుడు బాబిగాడు భలే గొడవ చేశాడనుకో వస్తానని! తీసుకొస్తే ఈ హాస్టల్‌ని ఒక కొలిక్కి తెస్తాడని మానుకున్నాను."

" మంచి పనిచేశావ్. లేకపోతే వాడి అండర్‌వేర్ పూడిపోయిందనీ, నెంబర్ టూకి వెళ్తాడనీ, అదనీ ఇదనీ, వాడి గొడవతోనే మన పుణ్యకాలం కాస్తా గడిచి పోయేది!" అంది జయ నవ్వుతూ.

(సశేషం)

**ఆంధ్రజ్యోతి వార పత్రిక 1-4-1977**